ఆటపాటలకు దూరం



అచ్చంపేట మండలం సింగారం అంగన్‌వాడీ కేంద్రం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో శిథిలమైన ఆట వస్తువులు
- పట్టించుకోని అధికారులు

అచ్చంపేట రూరల్: చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేందుకు ప్రభుత్వం ఆట సామగ్రిని సమకూర్చుతోంది. ఆటపాటా ద్వారా చిన్నారులను ప్రోత్సహిస్తున్నారు. కాని కొన్ని కేంద్రాల్లో ఆట వస్తువులు శిథిలం అయ్యి మూలనపడ్డాయి. దీంతో ఆటపాటలకు చిన్నారులు దూరమవుతున్నారు. చిన్నారులకు ఆటపాటలు నేర్పించి వారికి విద్యాబుద్ధులు నేర్పించాలనే సదుద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఆట వస్తువులు అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్రమంగా పని చేయకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు. దీంతో చిన్నారులకు అన్నింటిలోనూ వెనకబడిపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులే వీటి గురించి పట్టించుకోవడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద చిన్నారులు ఆటలాడుకోవడానికి ప్రత్యేకంగా ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. అవి కేంద్రాలు ఏర్పాటు చేసిన మొదట్లో మాత్రమే వాటిని బిగించారు. తర్వాత మళ్లీ కొత్తవి మంజూరు చేయలేదు. అంతేకాకుండా గతంలో మంజూరు చేసిన వాటికి కనీసం మరమ్మతులు కూడా చేయించడం లేదు. దీంతో చిన్నారులు కేంద్రాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. కేంద్రాల ముందు ఏర్పాటు చేసిన ఆట వస్తువులు ఎండకు వానకు తడిసి తుప్పు పట్టాయి. చిన్నారులు ఆడుకోవడానికి వీలులేకుండా పోయాయి. సొంత భవనాలు ఉన్న కేంద్రాలకు మాత్రమే ఊగుడు దండం, జారుడు బండలాంటి వస్తువులను గతంలో మంజూరు చేశారు. అవి ప్రస్తుతం పూర్తిగా తుప్పుపట్టిపోయాయి. అద్దె భవనం ఉన్న కేంద్రాలకు మాత్రం ఇలాంటి ఆట వస్తువులను మంజూరు చేయలేదు. అచ్చంపేట నియోజకవర్గం అచ్చంపేట, బల్మూర్ ఐసీడీఎస్ పరిధిలో 374 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో సుమారు 15వేల నుండి 20వేల మంది చిన్నారులు విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. ఈ చిన్నారులంతా కేంద్రాలకు సక్రమంగా రావాలంటే ముందుగా ఆట వస్తువులు సక్రమంగా ఉండాలి. ఏళ్ల తరబడి సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదు.


అచ్చంపేట మండలం సింగారంలో మూలనపడ్డ ఆట వస్తువులు

దిష్టిబొమ్మల్లా దర్శనం...

అంగన్‌వాడీ కేంద్రాల ముందున్న ఆట వస్తువులు శిథిలమై ఏళ్లు గడుస్తున్నాయి. ఊగుడు దండం మధ్యలో ఇనుప రాడ్లు తెగిపోయాయి. జారుడు రేకు తుప్పుపట్టి రంధ్రాలు పడి ఉన్నాయి. దీనిపై చిన్నారులు జారితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఊగుడు దండం, జారుడు బండలు కేంద్రాల ముందు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. అలాగే బొమ్మలతో ఆడించాల్సిన వస్తువులు కూడా దెబ్బతిన్నాయి. వాటిని కేంద్రాల మూలన పడేశారు.

ఇండోర్ ఆట వస్తువులు ఉన్నాయి..



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇండోర్ ఆట వస్తువులు ఉన్నాయి. అవుట్‌డోర్ వస్తువులు శిథిలావస్థకు చేరాయి. వాటి స్థానంలో కొత్తవి మంజూరు కాలేదు. మరిన్ని ఆట వస్తువుల కోసం ప్రతిపాదనలు పంపించాం. చదువుతో పాటు చిన్నారులకు ఆటలు నేర్పిస్తున్నాం.

– దమయంతి, సీడీపీఓ, అచ్చంపేట

క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం



కల్వకుర్తి టౌన్: డిపో పరిధిలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు డీఎం సుభాషిణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని ప్రజలు, ప్రయాణికులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు వారి సలహాలు సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. సెల్: 9959226292 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గురుకులాలకు 16 మంది విద్యార్థులు ఎంపిక

కోడేరు: మండల కేంద్రంలోని ప్రగతి విద్యానిలయంలో చదువుతున్న 16 మంది విద్యార్థులు గురుకుల సీట్లు సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం రాజీవ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల ఎంపికపై సంతోషం వ్యక్తం చేశారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



తెలకపల్లి: మండల కేంద్రంతో పాటు దాసుపల్లి, రాకొండ గ్రామాలను గురువారం అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ సందర్శించారు. మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు మిషన్ కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులకు సంబంధించిన యూనిఫాంలను త్వరగా సిద్ధం చేయాలని ఆదేశించారు. రాకొండ, నడిగడ్డ గ్రామాలను సందర్శించి నర్సరీలను పరిశీలించారు. పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి సూచించారు. ఎంపీఓ వెంకటయ్య, ఏపీఓ మల్లేష్, పంచాయతీరాజు పీఆర్ఏఈ మల్లారెడ్డి, ఎంఓ కృష్ణయ్య, ఐకేపీ నిరంజన్ పాల్గొన్నారు.

విండో చైర్మన్ బాధ్యతలు స్వీకరణ

తాడూరు: సింగిల్‌విండో చైర్మన్‌గా బుధవారం ఏకగ్రీవంగా ఎంపికైన రామచంద్రారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు. వానాకాలం ప్రారంభమైన దృష్ట్యా విత్తనాలు, రసాయనిక ఎరువులు, అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం

లింగాల: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఒండ్రు మట్టిని తరలిస్తున్న 4 ట్రాక్టర్లు, ఒక జేసీబీని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ జగన్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ధారారం సమీపంలో ఉన్న చీకటి చెరువు నుంచి అక్రమంగా ఒండ్రు మట్టిని తరలిస్తున్నారు. ఘటన స్థలంలో జేసీబీని, ట్రాక్టర్లను స్వాధీన చేసుకొని ఇరిగేషన్ శాఖ అధికారుల సూచనల మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై ప్రత్యేక దృష్టి



తాడూరు: ఆయిల్‌పాం సాగుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జిల్లా ఉద్యావన శాఖ జిల్లా అధికారి అశోక్ అన్నారు. గురువారం మండలంలోని మేడిపూర్‌లో రైతు వెంకట్‌రెడ్డి సాగు చేసిన ఆయిల్‌పాం పంటసాగును క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగు విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారులు సౌమ్య, పనికుమార్, ప్రమోద్‌కుమార్, రైతు వెంకట్‌రెడ్డి, సందమల్లయ్య, గౌరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరంలో ఎమ్మెల్యేల పూజలు

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో గురువారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో పాటు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాపనాశినిగుండం వద్ద పుణ్యస్నానమాచరించి, గణపతిపూజ, అమ్మవారికి కుంకుమార్చన, శివుడికి అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్, అర్చకులు, సిబ్బంది ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు. ఆలయ విశిష్టత గూర్చి చొప్పదండి ఎమ్మెల్యేకు వివరించారు.

విత్తనాలు, ఎరువుల కొరత లేదు


పెద్దకొత్తపల్లి మన గ్రోమోర్ ఎరువుల దుకాణంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

పెద్దకొత్తపల్లి: రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేదని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం గోదాం మన గ్రోమోర్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆకస్మికంగా కలెక్టర్ ఉదయ్‌కుమార్ సందర్శించారు. రైతులకు పంపిణీ చేస్తున్న జీలుగ విత్తనాలు, ఎరువుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం జిల్లాలో 4.59 లక్షల ఎకరాలలో సాగు అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారని పేర్కొన్నారు. దీనిలో వరి 14,082, పత్తి 2,73720, మొక్కజొన్న 45,237 ఎకరాలలో సాగుకు ప్రణాళికలు తయారుచేశారన్నారు. ప్రణాళిక అంచనాల ప్రకారం విత్తనాలు, ఎరువుల రైతులకు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 2,42,669 ప్యాకెట్ల పత్తివిత్తనాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. 143.7 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే ఎరువులు 25,484 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. మన గ్రోమర్ ఎరువుల విక్రయ కేంద్రంలో రిజిస్టర్‌లను పరిశీలించారు. డీలర్ ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. స్టాక్ వివరాలు బోర్డుపై స్పష్టంగా ఉంచుతూ వాటి వివరాలు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు. గడువు ముగిసిన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి అమ్మకానికి సంబంధించిన రశీదు రైతులకు ఇవ్వాలన్నారు. మార్కెట్ కమిటీ ఆవరణలో ఎరువుల దుకాణాల యజమానుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, కొల్లాపూర్ ఏడీఏ రవి, మండల వ్యవసాయ అధికారి శ్రీరాం ఉన్నారు.

పాఠశాల పనులు వేగవంతం చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేసరికి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ పి ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని శ్రీపురం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. పాఠశాలలో మరమ్మతు పనులు, మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు అవసరమైన తాగునీరు, పాఠశాలలో వంటగది, మరుగుదొడ్ల పనులు పూర్తి చేయాలని సూచించారు. స్ట్రాంగ్ టీచర్ వెంకటేశ్వరశెట్టి, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

- అడిషనల్ కలెక్టర్ సీతారామారావు

వెల్దండ: పచ్చిరొట్ట ఎరువుల కొరత లేకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ సీతారామారావు పేర్కొన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ కార్యాలాయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు, జనుము, జీలుగ విత్తనాలను ప్రభుత్వం రైతుకు 60 శాతం సబ్సిడీతో అందిస్తుందన్నారు. రసాయనాల ఎరువుల వాడకం తగ్గించడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఏఓ మంజుల, నరేష్, సింగిల్‌విండో కార్యదర్శి శ్రీనివాసులు, ఏఈఓ గణేష్ తదితరులు ఉన్నారు.

ఆర్‌ఎస్పీకి సన్మానం


ఆర్‌ఎస్పీని సన్మానిస్తున్న నాయకులు

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు గురువారం హైదరాబాద్‌లో నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, తదితర విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఐజాక్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, నిరంజన్, తిరుమల్‌రావు, నిరంజన్, నర్సింహ్మముదిరాజ్, జంగయ్య, అశోక్, రవి, ప్రసాద్, శ్రీను, కార్యకర్తలు ఉన్నారు.

బీచ్ టార్గెట్ బాల్‌లో నల్లమల విద్యార్థుల ప్రతిభ


ట్రోఫీతో తెలంగాణ బాలుర జట్టు

అచ్చంపేట రూరల్: బీచ్ టార్గెట్ బాల్ 2వ సీనియర్ నేషనల్ చాంపియన్ షిప్‌లో తెలంగాణ బాలురు, బాలికల విభాగం విజయ దుందుభి మోగించింది. ఈనెల 27 నుంచి 30 వరకు మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా గుహగర్ బీచ్‌లో నేషనల్ చాంపియన్ షిప్ టోర్నమెంట్ నిర్వహించారు. తెలంగాణ జట్టు బాలురు బంగారు పతకం (ప్రథమ స్థానం), బాలికల జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుందని తెలంగాణ బీచ్ టార్గెట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సభావట్ బాబునాయక్, అసోసియేషన్ అధ్యక్షుడు రేవంత్, కోచ్ పద్మ తెలిపారు. జట్టులో నల్లమల ప్రాంతానికి చెందిన క్రీడాకారులు ఉదయ్ కిరణ్, దేవ్‌సింగ్, అరవింద్, దేవేందర్, ప్రకాష్ ఉన్నారని తెలిపారు. ఫైనల్స్ బాలుర విభాగంలో తెలంగాణ 8, గోవా 5 గోల్స్, బాలికల విభాగంలో తమిళనాడు 2, తెలంగాణ ఒక గోల్ సాధించినట్లు తెలిపారు.

రేపు బొడ్రాయి ప్రతిష్ట ప్రథమ వార్షికోత్సవం

ఉప్పునుంతల: మండల కేంద్రంపాటు గట్టుకాడిపల్లి, కొత్తరాంనగర్ గ్రామాల్లో బొడ్రాయి ప్రతిష్ట ప్రథమ వార్షికోత్సవం జూలై 1న నిర్వహిస్తునట్లు దేవాలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అభిషేకాలు, విశేష అలంకరణలు, ఉదయం 10 గంటలకు బొడ్రాయికి అభిషేకాలు, 11 గంటలకు ఆలయ ఆవరణలో మూలమంత్ర హవనములు, హోమం, పూర్ణాహుతి, మహా నివేదన, మహా మంగళహారతి ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం బోనాల ఉత్సవం నిర్వహిస్తునట్లు వివరించారు

మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు



పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి వంగభాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం మంత్రి శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో హనుమంతు, బాలరాజు, మూలెకుమార్, రవి, సురేష్, తిరిగిరి శంకర్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



కల్వకుర్తిరూరల్: మండలంలోని గుండూరు గ్రామానికి చెందిన సత్యనారాయణ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి ఆస్పత్రికి వెళ్లి సత్యనారాయణను పరామర్శించాడు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట సురేందర్‌రెడ్డి, భరత్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అదేవిధంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్యయాదవ్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రితో చికిత్స తీసుకుంటున్నాడు. జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు రాములుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, బి శ్రీశైలం యాదవ్, జూపల్లి రాములు యాదవ్ తదితరులతోపాటు పలువురు నాయకులు పెద్దయ్యయాదవ్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అజిలాపూర్‌లో ఈత వనం దగ్ధం

వెల్దండ: మండలంలోని అజిలాపూర్‌లో ఈత వనం దగ్ధమైన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామంలోని గీతకార్మికులు ఈతవనంలోని చెట్లను గీస్తు జీవనం సాగిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఈత వనానికి నిప్పుపెట్టడంతో దాదాపుగా వందల చెట్లు కాలిపోయాయి. అధికారులు పూర్తి విచారణ చేసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.



ముగిసిన నృత్య శిక్షణ శిబిరం


నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

కల్వకుర్తిరూరల్: స్వర్ణభారతి కళానిలయం ఆధ్వర్యంలో 35 రోజులపాటు నిర్వహించిన వేసవి నృత్య శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. కూచిపూడి, జానపద, పాశ్చాత్య నృత్యాలలో శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా నృత్య ప్రదర్శనలతో అందరిని ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై మాట్లాడారు. 17 సంవత్సరాలుగా వేలాది మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న నిర్వాహకులను అభినందించారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శనలు ఇవ్వడం ఎంతో గొప్ప విషయం అన్నారు. పద్మశ్రీ అవార్డు అందుకున్న కొండప్పతోపాటు మరో 14 మంది నిష్ణాతులకు ప్రపంచస్థాయి సేవరత్న పురస్కారాలను అందజేశారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, మాధవరెడ్డి, షాహెద్, సంగీత దర్శకుడు రాజాబాబు, విజయ్‌గౌడ్, స్వర్ణభారతి కళానిలయం సంస్థ వ్యవస్థాపకుడు మారోజు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ


కంటి అద్దాలు అందజేస్తున్న జలంధర్‌రెడ్డి దంపతులు

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మాచారం గ్రామ శ్రీమంతుడు అనూష ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్ అధినేత జలంధర్ రెడ్డి కంటి బాధితులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించి గురువారం కంటి అద్దాలను పంపిణీ చేశారు. రెండు నెలల కిందట అచ్చంపేట నియోజక వర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 2000 మందికి మాచారంలో శంకర నేత్రాలయ చెన్నై వారి నేతృత్వంలో 10 రోజుల పాటు ఉచితంగా కంటి పరీక్షలు చేయించారు. ఈ కంటి పరీక్షల్లో భాగంగా శస్త్ర చికిత్సలు అవసరమైన 185 మందికి చెన్నైకు తీసుకెళ్లి కంటి శస్త్ర చికిత్సలు చేయించారు. అందులో ప్రస్తుతం 150 మందికి కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్దిరాజు, గ్రామస్తులు రేణయ్య, రాంచంద్రయ్య, జగన్, రాజు, అంజియాదవ్, రామాంజనేయులు, నాగేశ్వర్‌రావ్, శ్రీనివాసులు, రమేష్, సురేష్, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై అవగాహన

తాడూరు: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు, క్షేత్ర సహాయకులకు ఉపాధి హామీ పనులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ఎంపిక చేసిన పనులకు సంబంధించిన వివరాలతోపాటు కొలతలు తీసుకునే విధానం వంటి అంశాలను చార్ట్‌ల ద్వార ఏపీఓ చంద్రసిద్దార్థ వివరించారు. ముందస్తుగానే ఎంపిక చేసిన పనులు గ్రామసభలో ఉంచి 10 పనులు నాణ్యతగా చేయాలని కోరారు. సమావేశంలో ఆయా గ్రామాల క్షేత్ర సహాయకులు, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఏపీఓ చంద్రసిద్దార్థ

చిన్నారులను పనుల్లో పెట్టుకోవద్దు


అధికారులతో మాట్లాడుతున్న యశ్వంత్

మన్ననూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పేద కుటుంబాల వారికి పని కల్పించాలనే ఉద్దేశ్యంతో అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం పనులలో చిన్నారులు లేకుండా చూడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ నల్లవెల్లి యశ్వంత్ కోరారు. గురువారం మన్ననూర్‌లో నీటి కుంట మరమ్మతు పనులు చేస్తున్న ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణతో మాట్లాడారు. గ్రామాలలోని వివిధ కుటుంబాలలోని పెద్దల పేరుతో ఉన్న ఉపాధి కార్డుపై చిన్నారులు వెళ్లి పని చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని వివరించారు. చిన్నారులు పనిలో ఉండకుండ చూడాలని కోరారు. కార్యక్రమంలో రంజిత్, పాండు తదితరులు పాల్గొన్నారు.

రైతులు సభ్యత్వ నమోదు చేసుకోవాలి

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు సింగిల్‌విండో కార్యాలయంలో సభ్యత్వ నమోదు చేసుకోవాలని డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో రైతులు సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టా భూమి కల్గిన రైతులు సింగిల్‌విండో సభ్యత్వ నమోదు చేసుకొని ఓటుహక్కు పొందాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.


వెల్దండలో సింగిల్‌విండోలో సభ్యత్వ నమోదు చేసుకుంటున్న రైతులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులను సన్మానిస్తున్న విద్యార్థులు

వెల్దండ: మండలంలోని కొట్రగేట్ వద్ద కల్వకుర్తి ప్రభుత్వ పాఠశాలకు చెందిన 1988–1989 పదవ తరగతికి సి–సెక్షన్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను సన్మానించారు. గురువులకు పాదపూజ చేశారు. దాదాపుగా 35 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబవివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో గురువులు ఎ. సుభాష్, సత్యనారాణ, యాదగిరి, పూర్వ విద్యార్థులు రాఘవేందర్‌గౌడు, నర్సింహ్మ, అనిల్‌కుమార్, వెంకటయ్య, శ్రీనివాసులు, విష్ణువర్ధన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, బాలస్వామి, దేవిలాల్‌చౌహాన్ తదితరులు ఉన్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న తళారి మద్దిలేటి

నాగర్‌కర్నూల్‌రూరల్: బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగంపై విస్తృతంగా చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని అంబేడ్కర్ ఐడియలాజి మిషన్ అధ్యక్షుడు తళారి మద్దిలేటి అన్నారు. గురువారం స్థానిక పట్టణంలో రాజ్యాంగం తీరు తెన్నులు అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయనతో పాటు రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ పీఎస్ఎస్ మూర్తి పాల్గొని మాట్లాడారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, హక్కులు కల్పించారన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం, సిద్దోజిరావు, మల్లికార్జున్, చెన్నయ్య, గోవర్ధన్, భాస్కర్, వెంకటయ్య, చింత సత్తి తదితరులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

ఉప్పునుంతల: పంటల సాగుకు రైతులు విత్తనాల కొనుగోలు విషయంలో జాగ్రత్తలు పాటించి నాణ్యమైన మేలురకం విత్తనాలు ఎంపిక చేసుకోవాలని ఏఈఓ మంజుల సూచించారు. గురువారం మండల క్లస్టర్ పరిధిలోని కొత్తరాంనగర్, గుట్టమీది తండాలో రైతులకు విత్తనాల కొనుగోలుపై ఏఈఓ అవగాహన కల్పించారు. ప్రభుత్వం నుంచి ధ్రువీకరించబడిన కంపెనీలకు చెందిన విత్తనాలనే ఎంపిక చేసుకోవాలన్నారు. లైసెన్స్ పొంది ఉన్న డీలర్ల వద్ద విత్తనాలను కొనుగోలు చేసి విధిగా రసీదు పొందాలని సూచించారు. తక్కువ ధరకు వస్తున్నాయని నకిలీ విత్తనాలు వేసుకొని నష్టపోవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.